సాక్షి
ఖమ్మం
గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



కొలువు.. సులువంటూ...

సింగరేణిలో కారుణ్య నియామకాల పేరిట ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు దళారులు వసూళ్లకు పాల్పడుతున్నారు. 8లో



ఎగబాకిన మిర్చి ధర

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి క్వింటాకు రూ.600 మేర ధర పెరిగి రూ.19,100గా నమోదైంది. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
38° / 19°

వాతావరణం

గురువారం జిల్లా అంతటా ఉష్ణోగ్రతలు తీవ్రంగానే నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది.

వీధికుక్కల వీరవిహారం





జిల్లా కేంద్రంలోని ఓ ఇంటి ఎదుట కూనలతో కుక్క

- జిల్లాలో అధికారికంగానే 22వేలకు పైగా శునకాలు
- కేఎంసీ పరిధిలో 3,894 కుక్కలకు స్టెరిలైజేషన్
- అయినా నానాటికీ పెరుగుతున్న కుక్కల సంతతి
- విచక్షణారహితంగా దాడులు చేస్తుండడంతో ప్రజల బెంబేలు

ఖమ్మం మయూరిసెంటర్: వీధి కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఓవక్క కుక్కల నియంత్రణకు గాను గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నా... ఏ వీధిలో చూసినా గుంపులుగా తిరుగుతూ చుక్కలు చూపిస్తున్నాయి. ఇటీవల జిల్లాలోని పలు చోట్ల శునకాల దాడులు పెరిగిపోవడంతో కుక్కల గుంపు ఉన్న ప్రాంతం మీదుగా పాదచారులు, వాహనదారులు వెళ్లాలంటేనే హడలెత్తుతున్నారు. హైదరాబాద్, కరీంనగర్, కొత్తగూడెం తదితర జిల్లాల్లో ఇటీవల జరిగిన కుక్కల దాడులను తెలుసుకున్న ప్రజలు మరింత ఆందోళనకు గురువుతున్నారు. కుక్కలను నియంత్రించేందుకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రత్యేకంగా యానిమల్ కేర్ సెంటర్ ఏర్పాటుచేసి శస్త్రచికిత్స చేస్తున్నట్లు చెబుతున్నా... కుక్కల సంఖ్య ఏ మాత్రం తగ్గకపోవడం గమనార్హం.

ఫలితం ఏదీ?

జిల్లాలోని పట్టణాల్లో.. గ్రామాల్లో ఎక్కడ చూసినా వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు వైరా, మధిర, సత్తుపల్లి పట్టణాల్లో వీటి సంఖ్య అధికంగా ఉంది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో తల్లాడ, తిరుమలాయపాలెం, కూసుమంచి, కొణిజర్ల, ఖమ్మంరూరల్, కల్లూరు, ఏన్కూరు, బోనకల్ మండలాల్లో వీటి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. రాత్రి పూట విషయమేమో కానీ పట్టపగలు వీధుల్లో నడవాలంటే కుక్కల భయంతో ఒకటికి, రెండు సార్లు ఆలోచించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. వాహనాలపై వెళ్లే వారి వెంట పడడం, పాదచారులను కూడా కరుస్తుండడం సర్వసాధారణమైపోయింది.

జిల్లావ్యాప్తంగా 22 వేల శునకాలు..

పశుసంవర్ధక శాఖ గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం జిల్లాలో 22,849 కుక్కలు ఉన్నట్లు తేల్చారు. ఖమ్మం నగరంలో వీధి కుక్కలు 1,532, పెంపుడు కుక్కలు 3,600 ఉన్నట్లు చెబుతున్నా వీటి సంఖ్య ఇంతకు రెట్టింపు ఉంటుందని అంచనా. పశు సంవర్ధక శాఖ గతంలో ఈ సర్వే నిర్వహించడంతో ఈ సంఖ్య జిల్లావ్యాప్తంగా చాలా వరకు పెరిగినట్లు తెలుస్తోంది.

కుక్కల నియంత్రణకు చర్యలు



నగరంలో వీధికుక్కల సంఖ్యను నియంత్రించేందుకు యానిమల్ డే కేర్ సెంటర్‌లో స్టెరిలైజేషన్ చేయిస్తున్నాం. ఈ కార్యక్రమం నిరంతరాయంగా సాగుతోంది. ఒక వీధి నుంచి తీసుకొచ్చిన కుక్కలకు ఆపరేషన్ చేసి నాలుగు రోజులు పర్యవేక్షణ అనంతరం అదే వీధిలో వదిలిపెడుతున్నాం. యానిమల్ యాక్ట్ ప్రకారం కుక్కలను నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాం.

– ఆదర్శ్ సురభి, కమిషనర్, కేఎంసీ

- ఖమ్మంలోని జిల్లా ప్రధాన ఆస్పత్రిలో గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు 3,817 మంది కుక్కకాటు బాధితులు చికిత్స చేయించుకున్నారు. ఈ ఒక్క ఆస్పత్రికే ఇంత మంది వచ్చారంటే... జిల్లాలోని పీహెచ్‌సీలు, ప్రైవేట్ ఆస్పత్రులతో కలుపుకుంటే కుక్క కాటు బాధితుల సంఖ్యను ఊహించుకోవచ్చు.
- కొణిజర్ల మండలం పెద్దగోపతికి చెందిన ఊటుకూరి గణేష్–రమాదేవి కుమారుడు సిద్దార్థకు తల్లి రమాదేవి బుధవారం మధ్యాహ్నం ఇంటి ముందు ఆడిస్తూ అన్నం తినిపిస్తోంది. మధ్యలో నీళ్ల కోసం లోపలకు వెళ్లొచ్చే సరికి బాలుడిపై వీధి కుక్క దాడి చేయగా తీవ్రంగా గాయపడిన ఆయనను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.
- ఈనెల 14వ తేదీన చింతకాని మండలంలో జగన్నాథపురం, మత్కేపల్లి, అనంతసాగర్, చింతకానిల్లో కుక్కలు మనుషులపై దాడులు చేశాయి. ఒకేరోజు ఆరుగురు కుక్క కాటుకు గురై చింతకాని పీహెచ్‌సీలో చికిత్స చేయించుకున్నారు. మండలంలో కుక్క కాటు కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయని వైద్యులు చెబుతుండగా, శునకాల దాడులతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.
- గతేడాది ఏప్రిల్‌లో సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో ఇద్దరు చిన్నారులు వీధిలో ఆడుకుంటుండగా కుక్క ఒకరిని కరిచింది. దీంతో ఆ బాలుడికి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి మండలంలో చిన్నారులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.



సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో కుక్క దాడిలో చిన్నారి ముఖంపై గాయాలు (ఫైల్)

3,894 కుక్కలకు స్టెరిలైజేషన్



డే కేర్ సెంటర్‌లో వీధి కుక్కకు స్టెరిలైజేషన్ చేస్తున్న వైద్యులు

గత రెండేళ్లుగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో కుక్కల సంఖ్య భారీగా పెరగడం, పిల్లలు, పెద్దలపై దాడులకు దిగుతుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశాల్లోనూ ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని ప్రస్తావించడంతో 2021 మార్చిలో కుక్కల నియంత్రణ కోసం ఖమ్మంలో యానిమల్ కేర్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ కుక్కలకు ప్రత్యేకంగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స(స్టెరిలైజేషన్) నిర్వహించి వదిలేస్తారు. తద్వారా సంతతి పెరగకుండా అడ్డుకోవచ్చన్నది అధికారుల భావన. ఈ సెంటర్‌లో ఇప్పటివరకు 3,894 కుక్కలకు స్టెరిలైజేషన్ చేయగా, రూ.80 లక్షలు ఖర్చు చేశారు. రోజుకు 10 నుంచి 15 కుక్కలకు స్టెరిలైజేషన్ చేస్తున్నట్లు యానిమల్ కేర్ సెంటర్ వైద్యులు చెబుతున్నారు.

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న కుక్కకాటు బాధితులు

2022 జనవరి	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్	జూలై	ఆగస్టు
270	216	235	295	299	480	254	295

సెప్టెంబర్	అక్టోబర్	నవంబర్	డిసెంబర్	2023 జనవరి	మొత్తం
328	318	298	237	292	3,817

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, అధికారులు

- మార్చి కల్లా మెడికల్ కళాశాల సిద్ధం
- వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం వైద్యవిభాగం: ఎక్కువగా పేదవారే వచ్చే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యంపై నమ్మకం పెంచడంపై వైద్యులు, అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. పాత కలెక్టరేట్‌లో ఏర్పాటుచేయనున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో బుధవారం ఆయన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా పెద్దాస్పత్రి వైద్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విభాగాల వారీగా సమీక్షించిన కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలని.. అప్పుడే ఆస్పత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందచేయొచ్చని తెలిపారు.

ఇదేనా మీ పనితీరు?

ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో గతనెలలో చేసిన శస్త్రచికిత్సలపై సమీక్షించిన సమయంలో కలెక్టర్ గౌతమ్ అసహనం వ్యక్తం చేశారు. అన్ని విభాగాల్లో వైద్యులను నియమించడమే కాక పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తూ సౌకర్యాలు, వసతులు కల్పించినా అందుకనుగుణంగా సేవలు అందకపోవడం సరికాదన్నారు. అనుకున్న స్థాయిలో శస్త్రచికిత్సలు జరగడం లేదని, ఇకనైనా వైద్యులు, అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే వైద్యులు సమయపాలన పాటించాలని, ఇష్టం వచ్చినట్లు రాకపోకలు సాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక కంటి వెలుగులో గుర్తించిన వారికి కాటరాక్ట్ చికిత్సల షెడ్యూల్ సిద్ధంచేయాలని తెలిపారు. తొలుత కలెక్టర్ వైద్య కళాశాల ఏర్పాటులో భాగంగా జిల్లా గిరిజన అభివృద్ధి, జిల్లా పౌర సరఫరాల అధికారి, ఈవీఎం గోడౌన్లలో చేస్తున్న మార్పులను పరిశీలించారు. ఈ సంవత్సరం మార్చి కల్లా వైద్య కళాశాల నిర్వహణకు అనుమతి రానున్నందున, అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌ఓ బి.మాలతితో పాటు ఆర్ఎంఓలు, హెచ్ఓడీలు, వైద్యాధికారులు పాల్గొన్నారు.



పరీక్ష చేయించుకున్న వ్యక్తికి కంటి అద్దాలు పెడుతున్న కలెక్టర్ గౌతమ్

42,428మందికి అద్దాలు

ఖమ్మంమయూరిసెంటర్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కాళోజీ నారాయణరావు పార్కు బస్తీ దవాఖానాలో బుధవారం ఏర్పాటుచేసిన కంటివెలుగు శిబిరాన్ని మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో మంగళవారం నాటికి 1,74,631 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన 42,428 మందికి రీడింగ్ అద్దాలు అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, డీఎంహెచ్‌ఓ బి.మాలతి, కార్పొరేటర్ రుద్రగాని శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తెచ్చుకోండి

ఖమ్మం సహకారనగర్: అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ సక్రమంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలను బుధవారం ఆయన తనిఖీ చేయగా కొన్ని విభాగాల్లో ఉద్యోగులు లేకపోవడంతో ఆరా తీయగా మధ్యాహ్న భోజనానికి వెళ్లినట్లు సిబ్బంది చెప్పారు. అన్ని వసతులు ఉన్నందున మధ్యాహ్న భోజనం తెచ్చుకోవాలే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు.

అత్యవసర పనులకు రూ.5 కోట్లు

- నీటిపారుదల శాఖ ఆస్తుల రక్షణపై ప్రత్యేక దృష్టి
- జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్

నేలకొండపల్లి: జిల్లాలో నీటి పారుదల రంగానికి సంబంధించి అత్యవసర పనుల కోసం రూ.5 కోట్లు మంజూరయ్యాయని జలవనరుల శాఖ సీఈ శంకర్ నాయక్ తెలిపారు. నేలకొండపల్లి మండలంలోని నందిగామ బ్రాంచి కెనాల్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో సీఈ మాట్లాడుతూ వివిధ కారణాలతో సాగునీరు 39 శాతం మేర వృథా అవుతుందని పేర్కొన్నారు. శాఖలో ఉద్యోగుల కొరత ఉన్నా చివరి ఆయకట్టు వరకు నీరందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. ఇక జిల్లాకు 11 వేల క్యూసెకులకు గాను 9వేలు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వస్తోందని, పాలేరుకు 6 వేల క్యూసెకుల్లో 3,500క్యూసెక్కుల నుంచి 4,900 క్యూసెక్కుల నీరు వస్తోందని వివరించారు. ఈమేరకు రైతులు వృథా చేయకుండా పొదుపుగా వాడుకుంటూ పంటలను కాపాడుకోవాలని సూచించారు. ఇక పెనుబల్లి, గుబ్బగుర్తి వద్ద గండ్లు పడగా యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయించామని చెప్పారు. జిల్లాలో శాఖకు 8,992 ఎకరాల భూమి ఉండగా, గజం కూడా ఆక్రమణకు గురికాకుండా పర్యవేక్షిస్తున్నామని సీఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఈఈ ఎం.వెంకటేశ్వర్లు, నేలకొండపల్లి డీఈఈ మన్మథరావు, ఏఈ నరేష్ పాల్గొన్నారు.



యడవల్లి లక్ష్మీపురం వద్ద మంగాపురం మేజర్ కాల్వ షట్టర్లను పరిశీలిస్తున్న సీఈ శంకర్‌నాయక్

అధికారులకు మెమోలు

ముదిగొండ: మండలంలోని యడవల్లి లక్ష్మీపురంలో మంగాపురం మేజర్ కాలువ, ఎన్నెస్పీ క్వార్టర్లను సీఈ శంకర్‌నాయక్ పరిశీలించారు. ఈసందర్భంగా కాల్వ షట్టర్లు, వంతెనలు శిథిలావస్థకు చేరి ఎనిమిదేళ్లయినా మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని ఆరా తీసిన ఆయన సంబంధిత ఉద్యోగులకు చార్జ్‌మెమోలు జారీ చేయాలని ఈఈని ఆదేశించారు. అనంతరం సీఈ శంకర్‌నాయక్ విలేకరులతో మాట్లాడుతూ సాగర్ కాల్వల్లో తుంగ, నాచు, పూడిక పెరిగి చివరి ఆయకట్టుకు నీరందడంలో ఇబ్బంది ఉందని తెలిపారు. సీఈ వెంట ఈఈ ఎం.వెంకటేశ్వర్లు, డీఈ మన్మథరావు, ఏఈ బాబు ఉన్నారు.

ఎన్నటికి వసూలయ్యేనో ?!

- జిల్లాలో నత్తనడకన ఇంటి పన్నుల వసూళ్లు
- రూ.23కోట్లలో వచ్చింది రూ.8కోట్లే
- ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు 37రోజులే గడువు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని గ్రామపంచాయతీల్లో పన్నుల వసూళ్లు ఆశాజనకంగా సాగడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా 37రోజులే గడువు ఉన్నా 35 శాతం కూడా వసూలు కాకపోవడం గమనార్హం. ఏటా చివరి వరకు మిన్నకుండిపోవడం.. ఆఖరులో హడావుడి చేయడం అధికారులకు అలవాటుగా మారింది. ఈసారి కూడా అదే పరిస్థితి కనిపిస్తుండగా.. అసలు వసూలవుతాయా, లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

గడువు సమీపిస్తున్నా...

జిల్లాలోని 20 మండలాల్లో 589 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.23,48,49,398 పన్నులు వసూలుచేయాల్సి ఉంది. అయితే, ఇందులో రూ. 8,17,43,295 మాత్రమే(35శాతం) వసూలు కావడం గమనార్హం. మిగిలిన 37రోజుల్లో రూ.15,31,06,103 మేర ఎలా వసూలు చేస్తారన్నది తెలియరావడం లేదు. జిల్లాలోని అనేక గ్రామపంచాయతీల్లో సిబ్బంది ప్రతీ ఇంటికి డిమాండ్ నోటీసులు ఇస్తుండగా.. కొన్ని పంచాయతీల్లో మాత్రమే వసూళ్లు ఆశాజనకంగా ఉన్నాయి. మిగతా పంచాయతీల్లో వసూళ్లపై అధికార యంత్రాంగం సైతం దృష్టి సారించటం లేదని తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి 31వ తేదీతో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యాన వసూళ్లు ఎలా చేయాలనే అంశాలపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.



కొణిజర్లలో పన్నులు వసూలు చేస్తున్న ఉద్యోగులు

కల్లూరు ఫస్ట్... ఖమ్మం రూరల్ లాస్ట్

ఇంటి పన్నుల వసూళ్లల్లో జిల్లాలోని 20 మండలాలకు గాను ఐదు మండలాల్లోనే 50శాతానికి వసూలయ్యాయి. కల్లూరు మండలం ఇంటి పన్నుల వసూళ్లలో 83శాతంతో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉండగా... ఖమ్మం రూరల్ మండలం 13 శాతంతో ఆఖరులో నిలిచింది. కల్లూరు మండలంలో 31 జీపీలు ఉండగా రూ.1,28,50,101కుగాను రూ. 1,06,71197 వసూలయ్యాయి. ఇక ఖమ్మం రూరల్ మండలంలోని 28జీపీల్లో రూ.8,08,03,080కు రూ.1,04,04,771లే వసూలు చేయడం గమనార్హం. జిల్లా కేంద్రమైన ఖమ్మంకు సుదూర మండలాలైన కల్లూరు, ఎర్రుపాలెం, తల్లాడ, కూసుమంచి, వైరా మండలాల్లో 50శాతానికి పైగా పన్నులు వసూలు కావడం, మిగతా మండలాలు వెనుకబడడంతో అధికారులు హడావుడిగా వసూళ్లలో నిమగ్నమయ్యారు.

పర్యవేక్షణ లేకపోవడంతోనే..

రెండేళ్లుగా జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) పూర్తిస్థాయిలో లేకపోవడం కూడా ఇంటి పన్నుల వసూళ్లలో జాప్యానికి కారణంగా తెలుస్తోంది. గతంలో కల్లూరు డీఎల్పీఓకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించగా, ఆతర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం డీఎల్పీఓను ఖమ్మం డీపీఓగా పూర్తి స్థాయి బాధ్యతలతో నియమించారు. ఆయన కూడా సెలవులో వెళ్లడంతో జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు ఆ బాధ్యతలతో పాటు ఇన్‌చార్జ్ డీపీఓగా బాధ్యతనూ నిర్వర్తిస్తున్నారు.

నూరు శాతం వసూలు చేస్తాం



మార్చి 31వ తేదీలోగా నిర్ణయించిన లక్ష్యం మేరకు మేరకు నూరుశాతం పన్నులు వసూలు చేస్తాం. ఇప్పటి వరకు వసూలైన పన్నుల వివరాలను కొన్ని ప్రాంతాల్లో ఆన్‌లైన్ చేయకపోవడం, తదితర కారణాలతో తక్కువగా చూపిస్తోంది. ఏది ఏమైనా ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు నూరుశాతం పన్నులు వసూలు చేయడంపై దృష్టి సారించాం.

– వీ.వీ.అప్పారావు, ఇన్‌చార్జ్ డీపీఓ

న్యూస్‌రీల్

క్లినికల్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఇంటర్మీడియట్ ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫీమేల్) కోర్సులో ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి క్లినికల్ శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. ఏడాది పాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి, అనుబంధ ఆస్పత్రుల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. బయోడేటా ఫాం, సంబంధిత సర్టిఫికెట్లతో పాటు రూ.10పోస్టల్ స్టాంప్ అంటించిన సొంత చిరునామా కవర్‌ను దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు దరఖాస్తులను మార్చి 3వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా తమ కార్యాలయంలో సమర్పించాలని డీఐఈఓ ఓ ప్రకటనలో తెలిపారు.

సదరమ్ క్యాంపుల షెడ్యూల్ విడుదల

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వచ్చే నెలలో నిర్వహించే సదరమ్ క్యాంపుల షెడ్యూల్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు వెల్లడించారు. మార్చి 7, 14, 21, 28వ తేదీల్లో సదరమ్ క్యాంపులు ఉంటాయని, హాజరయ్యే దివ్యాంగులు మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చేటప్పుడు స్లాట్ బుక్ చేసుకున్న రశీదు, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక ఫొటో, మెడికల్ సర్టిఫికెట్లతో రావాలని తెలిపారు.

‘యంగ్ అచీవర్స్’ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రధానమంత్రి యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పాఠశాలల విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి.జ్యోతి తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు https://socialjustice.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైతే 9, 10వ తరగతుల వారికి ఏటా రూ.75 వేలు, 11, 12వ తరగతుల విద్యార్థులకు ఏటా రూ.1.25 లక్షల మేర ఉపకార వేతనం అందుతుందని ఆమె తెలిపారు.

పాఠశాలల్లో డీఈఓ తనిఖీ



దెందుకూరు సర్పంచ్‌తో మాట్లాడుతున్న డీఈఓ శర్మ

మధిర: మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాల, టీవీఎం, హరిజనవాడ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో ఆయన తనిఖీ చేసి పరిసరాలను పరిశీలించారు. అలాగే, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి సామర్థ్యాలను తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అతర్వాత దెందుకూరు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన సమయాన తనిఖీ వెళ్లగా ప్రధానోపాధ్యాయుడు నారాయణదాసు లేకపోవడంపై ఆరా తీశారు. కాగా, పాఠశాల కార్యక్రమాలకు తనను ఆహ్వానించడం లేదని, నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని దెందుకూరు సర్పంచ్ కోట విజయశాంతి డీఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ తనిఖీల్లో డీఈఓ వెంట ఎంఈఓ వై.ప్రభాకర్ పాల్గొన్నారు.

వసతులు ఎలా ఉన్నాయి?

- పరిశీలించిన రాష్ట్ర జాయింట్ కమిషనర్



గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శేషుకుమార్, అధికారులు

బోనకల్: బోనకల్ గ్రామపంచాయతీని పంచాయతీరాజ్ రాష్ట్ర జాయింట్ కమిషనర్ శేషుకుమార్ బుధవారం పరిశీలించారు. స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో మెరుగ్గా ఉండడంతో బోనకల్ గ్రామపంచాయతీ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైంది. ఈ సందర్భంగా వచ్చిన జాయింట్ కమిషనర్ గ్రామంలోని డంపింగ్ యార్డ్, క్రీడాప్రాంగణం, వైకుంఠధామం, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు రహదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, ఎంపీడీఓ వేణుమాధవ్, ఎంపీఓ శాస్త్రి, సర్పంచ్ సైదానాయక్, కార్యదర్శి కిరణ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వచ్చే నెల 10న బీసీ గర్జన మహాసభ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కృష్ణయ్య, నాయకులు

సత్తుపల్లిరూరల్: వచ్చే నెల 10న సత్తుపల్లిలో బీసీల మహాగర్జన సభ నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు సభ పోస్టర్లను హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో ఎంపీ, సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బుధవారం ఆవిష్కరించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడేపల్లి కృష్ణమాచారి, నాయకులు లాల్‌కృష్ణ, అనంతయ్య, జిల్లపల్లి అంజి, రాజేందర్, పంతంగి వెంకటేశ్వరరావు, లింగనబోయిన పుల్లారావు, మరీదు ప్రసాద్, వెంకటాచారి, రాఘవులు, అశోక్ పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు అపోలో ఫార్మసీలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 24న జాబ్‌మేళా ఏర్పాటుచేసినట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీపీఆర్‌సీ భవన్‌లో శుక్రవారం ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలు మొదలవుతాయని పేర్కొన్నారు. డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగి, 18నుంచి 35ఏళ్ల లోపు యువతీ, యువకులు హాజరు కావొచ్చని పేర్కొన్నారు.

తెగుళ్ల నివారణపై దృష్టి సారించండి

ఖమ్మంరూరల్: వేసవిలో వేరుశనగ, పెసర సాగు చేస్తున్న రైతులు తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలని ఏఓ వి.నాగేశ్వరరావు సూచించారు. వేరుశనగలో ఆకుమచ్చ టిక్కా తెగులు సోకి ఆకులు రాలిపోయి పిండెల సరిగా రావడం లేదని తెలిపారు. ఈ తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5గ్రాములు లేదా కార్బన్‌డిజమ్ గ్రామును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. అలాగే, పెసరలో రసం పీల్చే పురుగులైన తెల్లదోమ నివారణకు ట్రైజోఫాస్, తామర పురుగు నివారణకు అసిఫేట్ పిచికారీ చేయాలని ఏఓ సూచించారు.

డబ్బులిస్తేనే పనులు చేయనిస్తా...

మధిర: అభివృద్ధి పనులు జరగాలంటే తనకు ముడుపులు ముట్ట చెప్పాల్సిందేనని డిమాండ్ చేసిన వ్యక్తిపై మధిర టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మండలంలోని మడుపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శీలం వెంకటరెడ్డి మన బస్తీ – మన బడి కార్యక్రమంలో భాగంగా మరమ్మతు పనులు చేపడుతున్నాడు. అయితే, అదే గ్రామానికి చెందిన వేల్పుల శ్రీనివాసరావు అలియాస్ బుజ్జి తనకు రూ.2 లక్షలు ఇస్తేనే పనులు చేయనిస్తానని బెదిరించడమే కాక కూలీలను కూడా అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అదుపు తప్పి లారీ పల్టీ

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ నుంచి బాణాపురం వెళ్లే మార్గంలో లారీ బుధవారం అదుపు తప్పి పక్కనే ఉన్న పొలాల్లో పల్టీ కొట్టింది. ఎరువుల లోడ్‌తో ఖమ్మం నుంచి పెద్దమండవకు ఎరువుల లోడ్‌తో వెళ్లిన లారీ అన్‌లోడ్ చేశాక డ్రైవర్ తిరిగి ఖమ్మం బయలుదేరాడు. ఈక్రమంలో బాణాపురం మూలమలుపు వద్ద అదుపు తప్పి పల్టీ కొట్టగా, డ్రైవర్ అప్రమత్తమై దూకడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

సాగర్ కాల్వలో పడి వివాహిత మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లిలో సాగర్ కాల్వలో ప్రమాదవశాత్తు పడిన వివాహిత మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మాదారపు రాజేశ్వరి(35) బట్టలు ఉతికేందుకు సాగర్ కాల్వకు వద్దకు వెళ్లగా తలపై ఉన్న చుట్టుగుడ్డ నీళ్లలో పడింది. దీనిని తీసే క్రమంలో నీళ్లలో పడిన రాజేశ్వరి ప్రవాహానికి కొట్టుకుపోతుండగా చేపలు పడుతున్న కొందరు గమనించి ఆమెను బయటకు తీసుకొచ్చారు. అనంతరం బంధువులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకునేలోగానే రాజేశ్వరి మృతి చెందింది. ఆమె తండ్రి నంద్యాల అప్పయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

బెల్ట్ షాపులో ఎక్సైజ్ అధికారులు తనిఖీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బెల్ట్ షాపును అధికారులు బుధవారం సీజ్ చేశారు. స్థానికంగా ఓ బెల్ట్ షాప్‌లో రెండు రోజుల క్రితం ధర విషయమై నిర్వాహకుడు, స్థానికుల నడుమ వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదం పెద్దదై ఎక్సైజ్ అధికారుల దృష్టికి వెళ్లగా బుధవారం నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ విజేందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివాదంపై ఆరా తీసిన ఆయన షాప్‌ను సీజ్ చేసి మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్సై శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి..

- అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచాలి
- మధిరలో పనులను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్

మధిర: అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చూస్తూనే నాణ్యత పాటించేలా పర్యవేక్షించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. మధిరలో బుధవారం పర్యటించిన ఆయన తొలుత ట్యాంక్ బండ్ పనులను పరిశీలించి వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆతర్వాత సమీకృత మార్కెట్ పనులను పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ వారంలో పనులన్నీ పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని చెప్పారు. ఇక మున్సిపాలిటీ పరిధిలో చిరు వ్యాపారులకు ఏర్పాటుచేసిన బడ్డీ కొట్లను పరిశీలించి మౌలిక వసతులు కల్పించాలని సూచించిన కలెక్టర్, తెలంగాణ తల్లి విగ్రహం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు నిర్మించే నాలుగు లైన్ల రహదారి పనులను పరిశీలించారు. అనంతరం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉపాధి హామీ పనులపై నిర్వహించిన వీసీకి తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టర్ హాజరయ్యారు. ఆతర్వాత ఇండోర్ స్టేడియం, వంద పడకల ఆస్పత్రి పనులను పరిశీలించిన ఆయన, అసంపూర్తిగా పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. తహసీల్దార్ రాజేష్, ఎంపీడీఓ కుడుముల విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ అంబటి రమాదేవి, మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లతా జయాకర్, వైద్య ఆరోగ్యశాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్, ఐబీ డీఈ నాగబ్రహ్మయ్య, అధికారులు నరేష్‌రెడ్డి, వినీషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైరాలో మార్కెట్ పనులపై సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్ (ఇన్‌సెట్) మధిరలో ట్యాంక్ బండ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

మార్కెట్ త్వరగా పూర్తిచేయండి

వైరా: వైరాలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. వెజ్, నాన్‌వెజ్ సమీకృత మార్కెట్ పనులను పరిశీలించిన ఆయన, ఎందుకు ఆలస్యమవుతోందని ఆరా తీశారు. పనులలో ఎక్కడా రాజీ పడకుండా, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆతర్వాత ఇండోర్ స్టేడియంను పరిశీలించిన కలెక్టర్, రహదారికి ఇరువైపులా ఉన్న ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని కమిషనర్ అనితను ఆదేశించారు. డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, తహసీల్దార్ ఎస్.అరుణ, అధికారులు పాల్గొన్నారు.

కొలువు..సులువంటూ..

'కారుణ్యం'లో వసూళ్లకు పాల్పడుతున్న కాలకేయులు

- ఫైల్ కదిలిస్తామంటూ రూ.లక్షల్లో బేరసారాలు
- దళారుల దందాతో నష్టపోతున్న కార్మికులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కాలం మారినా డిమాండ్ తగ్గని సింగరేణిలో కొలువుల కోసం రెగ్యులర్ నోటిఫికేషన్ల కంటే కారుణ్య నియామకాలే సులువనే అభిప్రాయం నెలకొంది. దీంతో తమ వారసులకు ఉద్యోగాలు ఇప్పించుకునేందుకు కార్మికులు సుముఖంగా ఉంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని దళారులతో పాటు కొందరు కార్మిక సంఘాల నేతలు పెద్ద ఎత్తునఅక్రమ దందాకు తెరలేపుతున్నారు.

ఒకప్పుడు తెలంగాణలో ఉపాధి అవకాశాలు అంటే దుబాయి, ముంబయి, బొగ్గుబాయి అన్నట్టుగా ఉండేది. తర్వాత కాలంలో ఐటీ పరిశ్రమ పుంజుకోవడం, ప్రైవేటు సెక్టారులో ఉపాధి అవకాశాలు ఏర్పడిన తర్వాత సింగరేణిపై కొంత ఒత్తిడి తగ్గింది. అయినప్పటికీ గోదావరిలోయ పరిధిలోని ఆరు జిల్లాల్లో ఇప్పటికీ సింగరేణి సంస్థనే ప్రధాన ఉపాధి వనరుగా ఉంది. కాగా, ఈ శతాబ్దం ఆరంభం నుంచి మ్యాన్ పవర్ తగ్గించుకోవడంపై సింగరేణి సంస్థ దృష్టి సారించింది. దీంతో లక్షకు పైగా ఉన్న ఉద్యోగుల సంఖ్య ప్రస్తుతం 40 వేలకు పడిపోయింది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం సింగరేణి సంస్థలో పెద్దగా నియామకాలు చేపట్టలేదు. 2015లో ఒకసారి, ఆ తర్వాత 2017లో నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. వీటి ద్వారా సుమారు 4,700 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. ఆ తర్వాత పలు నోటిఫికేషన్లు వెలువడినా వివిధ కారణాలతో భర్తీ ప్రక్రియ పూర్తి కాలేదు. అయితే తెలంగాణ వచ్చిన తర్వాత సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా ఇప్పటి వరకు 14,922 మందికి ఉద్యోగాలు వచ్చాయి. రెగ్యులర్ నోటిఫికేషన్ల ద్వారా జరుగుతున్న భర్తీ కంటే కారుణ్య నియామకాల ద్వారా మూడు రెట్లు అధికంగా కొత్త ఉద్యోగులు సంస్థలోకి వచ్చారు.

ఒత్తిడి తెస్తున్నారు..

కార్మికుల బాగోగుల కోసం అహర్నిశలూ కృషి చేసిన కార్మిక సంఘాల నాయకులు ఎంతోమంది సింగరేణి చరిత్రలో ఉన్నారు. ప్రాణత్యాగం చేసిన వారికీ కొదువ లేదు. ఇలా ఎందరో మహానేతలకు ఆశ్రయమిచ్చిన సింగరేణిలో ప్రస్తుతం కొందరు నాయకులు పూర్తిగా పైరవీలకే అంకితమయ్యారు. కారుణ్య నియామకాల్లో భాగంగా ఉండే అధికారుల్లో కొందరిని తమకు అనుకూలంగా మార్చుకుని చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. తాము చెప్పిన డీల్‌కు సై అంటేనే కారుణ్య నియామకం ఫైల్ ఓకే అవుతుందని, లేదంటే ఆ పని జరగదని నేరుగా చెప్పేస్తున్నారు. వీరి తరఫున ప్రత్యేక దళారుల టీమ్ నిత్యం సంప్రదింపులు చేస్తోంది. దీంతో వీటికి ప్రభావితమై కొందరు, ఈ ఒత్తిడి తట్టుకోలేక మరికొందరు కారుణ్య నియామకాల కోసం అప్పనంగా లక్షల రూపాయలు ముట్టచెబుతున్నారు. ఏళ్ల తరబడి కారుణ్య నియామకాల్లో పెనవేసుకుపోయిన అవినీతి, దాన్ని పెకిలించేందుకు తీసుకుంటున్న చర్యలు నామమాత్రమే కావడంతో దళారుల దందాకు అడ్డుకట్ట పడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో కార్మికులు తమ శ్రమార్జితాన్ని అన్యాయంగా నష్టపోతున్నారు. ఈ విషయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దందాపై ఇప్పటికైనా సంస్థ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

గడిచిన రెండేళ్లలో..

2018 మార్చి నుంచి 2023 జనవరి చివరి వరకు పరిశీలిస్తే 96 సార్లు మెడికల్ బోర్డులు ఏర్పాటు చేశారు. మొత్తం 18,966 మంది కార్మికులు మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇందులో 11,175 మందిని అన్‌ఫిట్‌గా గుర్తించారు. వారి వారసులు 9,861 మందికి కారుణ్య నియామక కోటాలో ఉద్యోగాలు వచ్చాయి. వీరిలో సగం మంది కరోనా అనంతర పరిణామాల్లో వాస్తవంగానే శారీరక సామర్థ్యం కోల్పోవడం, అనారోగ్యం బారిన పడిన వారు ఉన్నారు. ఒక్క రూపాయి కూడా అక్రమ పద్ధతిలో చెల్లించకుండా వీరి వారసులకు ఉద్యోగాలు రావాల్సి ఉంది. కానీ, అన్ని అర్హతలు ఉన్నా దళారుల ముసుగులో ఉన్న నేతలు చెప్పినంత సొమ్ము సమర్పించుకోకుంటే తమ వారసులకు అన్యాయం జరుగుతుందేమో అనే భయం సంస్థ వ్యాప్తంగా ఉన్న కార్మికుల్లో నెలకొంది.

తీర్మానం లేకుండానే నియామకాలు

వైరా మున్సిపల్ ఛైర్మన్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు, పక్కన ఎమ్మెల్సీ మధు

వైరా: వైరా మున్సిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్‌పై బుధవారం కౌన్సిలర్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు ఖమ్మంలో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్‌తో కలిసి వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం వివరాలను ఓ ప్రకటనలో వెల్లడించారు. మున్సిపల్ వాహనాలకు వినియోగించాల్సిన డీజిల్‌ను మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం లేకుండానే ప్రైవేట్ వాహనాలకు మళ్లించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే, పలువురు డ్రైవర్లు, శానిటరీ సిబ్బందిని తనకు అనుకూలమైన ఏజెన్సీ ద్వారా నియమించారని, ఖాళీ స్థలాలకు సెల్ఫ్ అసెస్‌మెంట్‌తో ఇంటి నంబర్లు కేటాయించి యజమానుల దగ్గర నగదు వసూలు చేశారని ఆరోపించారు. ఇంకా పదో వార్డులో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకును తొలగించి ఆ స్థలాన్ని మరో వ్యక్తికి చెందేలా అనుమతి జారీ చేశారని తెలిపారు. కాగా, కలెక్టర్‌ను కలిసిన వారిలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముళ్లపాటి సీతారాములు, కౌన్సిలర్లు దారెల్లి కోటయ్య, టి.నాగేశ్వరరావు, వేణు, రామారావు ఉన్నారు.

రూ.3.06 లక్షల విలువైన మద్యం చోరీ


సీసీ కెమెరాల్లో నమోదైన అనుమానితులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని తాళ్లమడ సమీపాన పెద్ద వంతెన వద్ద ఉన్న శబరి వైన్స్ షాపులో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. అర్ధరాత్రి ఒంటి గంట సమయాన షాపు కిటికీ గ్రిల్స్ తొలగించిన గుర్తు తెలియని వ్యక్తులు లోపలకు ప్రవేశించి రూ.3.06 లక్షల విలువైన 1,920 మద్యం సీసాలు ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని బుధవారం గమనించిన వైన్స్ యజమాని చింతలపాటి సత్యనారాయణ చేసిన ఫిర్యాదుతో సత్తుపల్లి పోలీసులు పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

లారీ ఎక్కిన బోటు !



సాధారణంగా బోటు చెరువులు, నదుల్లో లేదంటే సముద్రంలోనో కనిపిస్తుంది. కానీ బుధవారం ఓ బోటును లారీపై తీసుకెళ్తుండగా వైరాలో కనిపించింది. రాజమండ్రి నుంచి ఖమ్మం వైపు లారీ మీద బోటు తరలిస్తుండగా స్థానికులు ఆసక్తిగా పరిశీలించారు. – వైరా

పీఆర్సీ సాధనకు దశలవారీ ఆందోళనలు

ఖమ్మంగాంధీచౌక్: విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీ సాధన కోసం దశలవారీగా నిరసనలు చేపట్టాలని టీఎస్‌పీఈ జేఏసీ నాయకులు నిర్ణయించారు. సంస్థలోని అన్ని యూనియన్ల నాయకులు, వెల్ఫేర్ అసోసియేషన్, అధికారులు ఖమ్మంలోని విద్యుత్ వసతిగృహంలో బుధవారం సమావేశమై కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా జేఏసీగా ఏర్పడిన వారు వివరాలను వెల్లడించారు. ఈనెల 24, 25, 27, 28 తేదీల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన, మార్చి 1, 2వ తేదీల్లో భోజన విరామ సమయాన డివిజన్ కార్యాలయాలు, జనరేటింగ్ స్టేషన్ల వద్ద నిరసన, 3, 4వ తేదీల్లో కార్పొరేట్ ఆఫీస్ వద్ద నిరసన, 14న పాల్వంచ కేటీపీఎస్, 17న వరంగల్, 24న విద్యుత్ సౌధ వద్ద ధర్నా నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో శేష గిరిరావు, హీరాలాల్, రవికుమార్, రఘోత్తంరెడ్డి, ప్రసాద్, నాగార్జున, రామకృష్ణ, నరేష్,మౌలాలి తదితరులు పాల్గొన్నారు.


సమావేశమైన టీఎస్‌పీఈ జేఏసీ నాయకులు

గుర్తు తెలియని మృతదేహాలకు అంత్యక్రియలు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం రామన్నపేట వద్ద రైలు నుండి జారి పడి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తితో పాటు కొత్త బస్టాండ్ దగ్గర వద్ద మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాలకు బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. వీరిద్దరి మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచగా, సంబంధీకులెవరూ రాలేదు. దీంతో ఖమ్మం టూ టౌన్, రైల్వే పోలీసుల సూచన మేరకు అన్నం ఫౌండేషన్ బాధ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, మార్చురీ సిబ్బంది కూరాకుల శ్రీనివాస్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో స్థిరపడిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం కొనతమాత్మకూరుకు చెందిన పరుచూరి కార్తీక్(38) పదిహేనేళ్ల క్రితం ఖమ్మం వచ్చి ఇక్కడే స్థిరపడి వివాహం చేసుకున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఆయన మమతా రోడ్డులోని హయగ్రీవ అపార్ట్‌మెంట్‌లో ఉంటుండగా, ఇటీవల తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే మంగళవారం ఉదయం వాకింగ్ కోసం లకారం ట్యాంక్ బండ్ వద్దకు వెళ్లిన ఆయన ఎంతసేపటికీ రాకపోవటంతో భార్య కృష్ణకుమారి బంధువులకు సమాచారం ఇవ్వగా ఎక్కడా గాలించినా ఫలితం లేకపోవడంతో ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, బుధవారం ఉదయం లకారం చెరువులో మృతదేహం తేలుతుండడంతో వాకింగ్‌కు వచ్చిన వారు ఇచ్చిన సమాచారం మేరకు వన్ టౌన్ సీఐ చిట్టిబాబు, ఎస్‌ఐ వెంకటేశం చేరుకుని అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో బోటులో వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. అనంతరం కార్తీక్ మృతదేహన్ని గుర్తుపట్టిన స్నేహితులు కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, ఆయన ఆత్మహత్యకు స్పష్టమైన కారణాలు తెలియరాలేదు.


కార్తీక్ మృతదేహం

ఉరి వేసుకుని వ్యక్తి..

కల్లూరు రూరల్: కల్లూరు మండలం చిన్నకోరుకొండికి చెందిన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన మేకల ప్రభాకర్‌రావు (35) భార్య బుధవారం కూలీ పనులకు వెళ్లగా ఎవరూ లేని సమయాన ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రఘు తెలిపారు.

ఘాటు తగ్గేలా.. చల్లగా ఉండేలా !



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నానాటికీ మిర్చి విక్రయాలు పెరుగుతున్నాయి. మిర్చి ఘాటుకు తోడు ఎండలు పెరుగుతుండడంతో ఇటు వ్యాపారులు, రైతులు అటు మార్కెట్ పరిసరాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ప్రతిరోజు ఉదయం మార్కెట్‌లోని మిర్చి యార్డు చుట్టుపక్కల ఇలా ట్యాంకర్‌తో నీళ్లు చల్లుతున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

చేతబడి అనుమానంతోనే హత్య

- పూజలు చేసిన తల్లాడ వాసి చెప్పడంతో ఘటన
- చెన్నూరు హత్య కేసులో ముగ్గురి అరెస్టు

కల్లూరు రూరల్: ఇంట్లో సమస్యలు ఉన్నాయని ఓ వ్యక్తి పూజలు చేయించాడు. అయితే, వీటన్నింటికీ దగ్గరి బంధువు చేతబడి చేయడమే కారణమని సదరు వ్యక్తి చెప్పాడు. దీంతో గ్రామంలో పూజలు చేసే వ్యక్తిని హత్య చేయగా... విచారణ చేపట్టిన పోలీసులు ముగ్గురిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలను కల్లూరు పోలీసుస్టేషన్‌లో ఏసీపీ రామాంజనేయులు విలేకరులకు వెల్లడించారు. కల్లూరు మండలం చెన్నూరుకు చెందిన పాటిబండ్ల శివ తల్లి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆయన తండ్రికి కూడా ఆరోగ్యం బాగా లేదు. అలాగే, రూ.80వేలు విలువైన పాడిగేదె ఇటీవల చనిపోయింది. ఈ ఇబ్బందులన్నింటి దృష్ట్యా శివ తన మేనమామ నూతలపాటి నారాయణ రావును సంప్రదించడంతో తల్లాడకు చెందిన పస్తం రంగారావును చెన్నూరుకు పిలిపించి పూజలు చేయించారు. ఈసందర్భంగా పూజలు చేసి యంత్రాలు కట్టిన రంగారావు.. శివ ఇంట్లో అనారోగ్యం, ఇబ్బందులుకు కారణం చేతబడేనని చెప్పాడు. వీరి ఇంటికి సమీపంలోనే ఉండే దగ్గరి బంధువే కారణమని వెల్లడించాడు. దీంతో గ్రామంలో ఎల్లమ్మ, ఉప్పలమ్మకు పూజలు చేసే పాటిబండ్ల శ్రీనివాసరావు(46) చేతబడి చేసి ఉంటాడని శివ అనుమానించాడు. ఈమేరకు గత ఆదివారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లిన శ్రీనివాసరావును స్కూటీపై వెంబడించిన శివ కత్తితో పొడిచి హత్య చేశాడు. విచారణలో ఆయనను నిందితుడిగా గుర్తించి బుధవారం పేరువంచ వద్ద అదుపులోకి తీసుకుని స్కూటీ, సెల్‌ఫోన్, షర్ట్, కత్తి స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ రామాంజనేయులు తెలిపారు. అలాగే, నారాయణరావును చెన్నూరులో, రంగారావును తల్లాడలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈసమావేశంలో సీఐ హనూక్, ఎస్‌ఐ రఘు పాల్గొన్నారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రామాంజనేయులు

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం

జూలూరుపాడు: జూలూరుపాడు పీఏసీఎస్ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డిపై అవిశ్వాస తీర్మానానికి బీఆర్‌ఎస్ రంగం సిద్ధం చేస్తోంది. ఈ మేరకు తొమ్మిది మంది డైరెక్టర్లు బుధవారం జిల్లా సహకార శాఖ అధికారి ఎస్.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కొంతకాలంగా వెంకటరెడ్డి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంట నడుస్తుండడంతో ఆయనపై అవిశ్వాసానికి బీఆర్‌ఎస్ సిద్ధమైంది. సొసైటీలో 13 వార్డులు ఉండగా 9 బీఆర్‌ఎస్, టీడీపీ, సీపీఐ, సీపీఎం, ఇండిపెండెంట్ ఒకరు చొప్పున గెలుచుకున్నారు. సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు బీఆర్‌ఎస్‌లోని రెండు గ్రూపుల వారు పోటీ పడ్డారు. వెంకటరెడ్డి గ్రూపులో ఏడుగురు, యల్లంకి సత్యనారాయణ గ్రూపులో ఆరుగురు డైరెక్టర్లు ఉండడంతో ఎన్నిక అనివార్యమైంది. 2020 ఫిబ్రవరి 16న ఎన్నికలు నిర్వహించగా లేళ్ల వెంకటరెడ్డి, కొమ్మినేని పాండురంగారావు నామినేషన్ వేశారు. ఉపాధ్యక్షుడిగా వెంకటరెడ్డి గ్రూపు నుంచి చీమలపాటి భిక్షం(సీపీఎం), సత్యనారాయణ గ్రూపు నుంచి మనుబోలు తిరువెంగళరాజు(టీడీపీ) నామినేషన్లు వేశారు. ఎన్నికల్లో అధ్యక్షుడిగా లేళ్ల వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడిగా చీమలపాటి భిక్షం గెలుపొందారు. ఆ తర్వాత టీడీపీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్‌ఎస్ డైరెక్టరు సంఖ్య 11కు చేరగా, సీపీఐ, సీపీఎంకు ఒక్కొక్కరు ఉన్నారు. వెంకటరెడ్డి పదవి చేపట్టి ఈనెల 16కు మూడేళ్లు పూర్తి కావడం, మారిన రాజకీయాల నేపథ్యాన ఆయనపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్‌ఎస్‌కు చెందిన ఏడుగురితో పాటు సీపీఎం, సీపీఐ సభ్యులు ఇద్దరు కలిపి తొమ్మిది మంది సిద్ధమై నోటీసు ఇచ్చారు.

ఈనాడు 'కొట్టు'కథ

రెండేళ్ల కిందటి ఫొటోలతో.. 'పట్టాభినీ కొట్టారు' అంటూ కట్టుకథనం

అవి పాత ఫొటోలని నిర్ధారించి.. ఉతికి ఆరేసిన సోషల్ మీడియా యాక్టివిస్టులు

(సాక్షి, అమరావతి)

'ఈనాడు'పత్రిక ఎందుకింతలా దిగజారిపోతోంది? ఒక పార్టీపై బురద జల్లడానికి.. ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చడానికి... పోలీసుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయటానికి... మనుషుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికి రెండేళ్ల కిందటి ఫొటోలు కూడా ఇవ్వాళ్టివేనని అబద్ధాలు చెబుతూ ప్రచురించే స్థాయికి ఎందుకు పడిపోయింది? అసలిలాంటి పత్రికను ఎవరైనా నమ్మొచ్చా? చంద్రబాబును అధికార పీఠంపైకి తేవటం కోసం ఈ రాష్ట్రాన్ని ఏం చేసినా పర్వాలేదనుకునే రామోజీరావు మనస్తత్వాన్ని క్షమించవచ్చా?

'పట్టాభినీ కొట్టారు'అంటూ పతాక స్థాయిలో వేసిన శీర్షికలోనే కాదు... ఆ వార్తలో ప్రతి అక్షరం అబద్ధాలతో కూడిన కాలకూట విషమే. అసలు పట్టాభిని కొట్టనే లేదని పోలీసులు కోర్టులో చెబితే... దాన్ని వైద్యాధికారులు సైతం ధ్రువీకరిస్తే... కొట్టారంటూ 'ఈనాడు'లో వార్తలేంటి? పైపెచ్చు... 'తీవ్రంగా కొట్టారు. అరచేతిపైనా, కాళ్లపైనా థర్డ్ డిగ్రీ ప్రయోగించార'ంటూ దుర్మార్గపు రాతలేంటి? ఆ రాతలన్నీ నిజమని నమ్మించటానికి వాటికి రుజువులుగా ఎప్పుడో రెండేళ్ల కిందట '2021 ఫిబ్రవరి 3న'తన పత్రికలోనే వేసిన ఫొటోలను మళ్లీ ఇపుడు వేసేసిన దౌర్భాగ్యపు పరిస్థితేంటి? అంటే... మీ దృష్టిలో మీ పాఠకులంతా వెర్రివాళ్లా రామోజీరావు గారూ? మీరు ఏం రాసినా నమ్మేస్తారనే భ్రమల్లోనే ఇంకా బతుకుతున్నారా? అదంతా ఒక చరిత్ర అని... 'సాక్షి'రాకముందు కొన్నాళ్లపాటు తెలుగు పత్రికారంగం ఎదుర్కొన్న సంధికాలమని ఇప్పటికీ తెలియటం లేదా? 'సాక్షి'ఆవిర్భవించిన నాటి నుంచీ మీ ఏకచ్ఛత్రాధిపత్యానికి కాలం చెల్లిందని... వార్తలకు రెండోవైపున ఏమున్నదో కూడా జనం చూస్తున్నారని మరిచిపోయారా? ఇంటర్నెట్ వేదికగా వ్యక్తులే శక్తిమంతమైన మీడియాగా మారుతున్న ఈ రోజుల్లోనూ మీరు పచ్చి అబద్ధాలను పోగేస్తే నమ్మేస్తారని ఎలా అనుకుంటున్నారు? అసలు ఏనాటికైనా మారుతుందా 'ఈనాడు'?

'బీసీ'ల అభ్యున్నతి జనానికి చేరకుండా...

సోమవారం శాసనమండలి అభ్యర్థులను ప్రకటిస్తూ... ఉన్న 18 స్థానాల్లో 14... అంటే ఏకంగా 68 శాతాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కేటాయిస్తూ కొత్త చరిత్రను లిఖించారు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా బీసీలు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. ఎక్కడికక్కడ ముఖ్యమంత్రి చిత్ర పటాలకు పాలాభిషేకాలు చేశారు. ఆనందంతో ర్యాలీలు చేశారు. ఇప్పటికే బీసీల్లో బలం పెంచుకున్న వై.ఎస్.జగన్‌కు... దీని వల్ల మరింత ఖ్యాతి వస్తుందని భావించిన తెలుగుదేశం, దాని మిత్ర మీడియా... వ్యూహం ప్రకారం అదేరోజున 'గన్నవరం'కుట్రకు తెరతీశాయి. తామే రెచ్చగొట్టి కయ్యానికి కాలుదువ్వటమే కాక... విజయవాడ నుంచి గన్నవరానికి వెళ్లి మరీ పట్టాభి సహా టీడీపీ నేతలు అక్కడి ఎమ్మెల్యే వంశీ అనుచరులతో ఘర్షణకు దిగారు. దాదాపు అన్ని ఛానెళ్లలోనూ బీసీలకు పట్టం కట్టిన వ్యవహారం రాకుండా... టీడీపీ చక్రం తిప్పింది. మంగళవారం నాడు 'ఈనాడు'లో ... గన్నవరంలో ప్రభుత్వమే దారుణాలకు పాల్పడ్డట్టుగా... పోలీసులే దౌర్జన్యం చేసినట్లుగా దారుణమైన కథనాలు వండివార్చేశారు. ఆ ఘర్షణల సందర్భంగా అరెస్టయిన పట్టాభిని పోలీసులు దారుణంగా కొట్టారంటూ బుధవారం దాన్ని కొనసాగించారు. అందుకు రుజువులుగా ఎప్పుడో 2021 ఫిబ్రవరి 3నాటి ఫోటోలను... ఇప్పటివేనంటూ వేసేశారు. అదీ జరిగిన కథ!!. ఔరా రామోజీ??

2021, ఫిబ్రవరి 3 'ఈనాడు'ఏం రాసిందంటే

'కర్రలు, రాడ్లతో పట్టాభిపై దాడి'అని 'ఈనాడు' బ్యానర్‌గా ప్రచురించిన వార్త ఇది. టీడీపీ నేత పట్టాభిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారంటూ 'ఈనాడు'హడావుడి చేసింది. విజయవాడలోని తన ఇంటి నుంచి కారులో వచ్చిన ఆయనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని... కారు అద్దాలు పగలగొట్టారని... పట్టాభిని కారు నుంచి బయటకులాగి... ఎడమ మోచేయి, ఎడమ మోకాలు, తొడపై ఇష్టారాజ్యంగా కొట్టారని వార్త ప్రచురించింది. తన భర్తకు ప్రాణహాని ఉందని పట్టాభి భార్య చందన ఆవేదన వ్యక్తం చేసినట్టు మరో వార్త ఇచ్చింది. పోలీసులు స్పందించి ఆ దాడిని మెడికో లీగల్ కేసుగా నమోదు చేస్తాం... ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేస్తామంటే పట్టాభి వద్దన్నారని, దాంతో... పోలీసులు బలవంతంగా ఆయన్ని ఆసుపత్రికి తీసుకువెళ్లారని ఇంకో వార్త వేసింది. పట్టాభికి సంఘీభావంగా చంద్రబాబు హుటాహుటిన ఆయన నివాసానికి వచ్చి పరామర్శించటమే కాక... ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే చంపేస్తారా? అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసిన వార్త కూడా వేసింది. ఇక పట్టాభి శరీరంపై గాయాలు... పట్టాభిపై దాడికి ఉపయోగించిన కర్ర... ధ్వంసమైన పట్టాభి కారు అద్దాలు...పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తీసుకువెళుతుండటంతో విలపిస్తున్న పట్టాభి... పట్టాభిపై దాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన తరువాత పోలీసులతో మాట్లాడుతున్న చంద్రబాబు... పట్టాభి శరీరంపై గాయాలను పరిశీలిస్తున్న చంద్రబాబు... అంటూ పెద్దపెద్ద ఫొటోలతో విపరీతమైన హడావుడి చేసి... రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడిందనే భావన కలిగించాలని కుట్ర పన్నింది.

కానీ... ఆ కుట్ర బెడిసికొట్టింది

చంద్రబాబు ఎత్తుగడ బెడిసికొట్టింది. ఎందుకంటే ఆ దాడి గురించి ఫిర్యాదు చేయడానికి పట్టాభి ఇష్టపడలేదు. ఎవరిపైనయినా అనుమానం ఉందా? అంటే కూడా చెప్పలేదు. పోలీసుల దర్యాప్తునకు సహకరించలేదు. పోలీసులు దర్యాప్తు జరపటానికే ఆయన ఒప్పుకోలేదు. ఎందుకో తెలుసా? వాస్తవానికి పట్టాభికి సంబంధించిన వ్యక్తిగత రహస్యాలు, వ్యక్తిగత వివాదాలు, ఆర్థిక లావాదేవీలు, కొందర్ని ఆయన చేసిన మోసాలు అప్పట్లో కథలుకథలుగా వినిపించాయి. తన వ్యక్తిగత రహస్యాలను బయట పడకుండా బ్లాక్‌మెయిలింగ్ చేసేందుకు పట్టాభే ఆ దాడి డ్రామా ఆడించారని టీడీపీ వర్గాలు లోలోపల వ్యాఖ్యానించాయి కూడా. ఇవన్నీ బయటకు వస్తాయన్న ఉద్దేశంతోనే ఆయన దర్యాప్తునకు ఇష్టపడలేదు. దీంతో పట్టాభిని అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయాలన్న చంద్రబాబు ఎత్తుగడ బెడిసికొట్టింది.

అయినా... మనసు మారలేదు

అప్పట్లో చంద్రబాబు ఎత్తుగడ బెడిసికొట్టినా... 'ఈనాడు'మాత్రం మారలేదు. మళ్లీ బుధవారం నాడు పాత స్కీమునే పునరావృత్తం చేసింది. పట్టాభి అరికాళ్లు, తొడలపై దెబ్బలు అంటూ అలనాటి 5 ఫోటోలను మొదటి పేజీలో ప్రచురించింది. 'దేశమంతా ఐపీసీ చట్టం.. రాష్ట్రంలో వైసీపీ చట్టం' అంటూ మరో కథనంతో మొదటి, రెండు పేజీలను నింపేసింది. 'నా భర్త ప్రాణాలకు ముప్పు'అంటూ పట్టాభి భార్య చందన వాపోతున్నట్టుగా మరో వార్తను ఏకంగా అయిదు ఫొటోలతో ప్రచురించి 3వ పేజీని నింపేసింది. 'ఫిర్యాదు చేస్తే దాడులు చేస్తారా'అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు మరో వార్త కూడా వేసింది. అంటే... రెండేళ్ల కిందటి ఘటనతో బుద్ధి తెచ్చుకోకుండా మళ్లీ ఆ స్కీమ్‌ను పునరావృత్తం చేశారు రామోజీరావు గారు. కాకపోతే మధ్యాహ్నానికల్లా సోషల్ మీడియాలోనే అందరూ నిజానిజాలు చెబుతూ 'ఈనాడు'వలువలు ఊడదీసేశారు. ఇప్పటికైనా రామోజీ మారతారా?

పట్టాభిని పోలీసులు కొట్టనే లేదు

వైద్య పరీక్షల్లో నిర్ధారణ

పట్టాభిని పోలీసులు కొట్టారన్న టీడీపీ ఆరోపణలు అవాస్తవమని స్పష్టమైంది. న్యాయస్థానం ఆదేశాలతో పట్టాభికి విజయవాడలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన శరీరంపై ఎలాంటి గాయాలు లేవని వైద్యులు నిర్ధారించారు. వైద్యులు రెండు సార్లు పరీక్షించి మరీ ఆయన శరీరంపై ఎలాంటి గాయాలు లేవని న్యాయస్థానానికి నివేదిక సమర్పించారు. దాంతో తనను కొట్టారంటూ పట్టాభి ఆడిన డ్రామా... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు చేసిన అవాస్తవ ఆరోపణలు... రాష్ట్రంలో ఐపీసీ కాదు వైసీపీ అమలు అవుతోందంటూ ఈనాడు చేసిన దుష్ప్రచారం అంతా పక్కా ముందస్తు కుట్రేనన్నది స్పష్టమైంది.

పట్టాభిని కొట్టామనడం

అవాస్తవం

- గొడవలు సృష్టించాలనే పట్టాభి దురుద్దేశం
- టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో 9 మంది అరెస్టు
- కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా వెల్లడి

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

టీడీపీ నేత పట్టాభికి

14 రోజుల రిమాండ్

- మొత్తం 11 మంది రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలింపు
- పట్టాభి శరీరంపై ఎలాంటి గాయాలు లేవు
- విజయవాడ జీజీహెచ్ వైద్యుల ధ్రువీకరణ
- ఈ మేరకు మెడికల్ సర్టిఫికెట్‌ను కోర్టులో సమర్పించిన పోలీసులు

గోదారికి కరకట్టలతో కట్టడి!

నదికి ఇరువైపులా రూ.8వేల కోట్లతో 16కి.మీల మేర నిర్మాణం

- కుడి వైపున సంజీవరెడ్డిపాలెం- అమ్మగారిపల్లె వరకు
- ఎడమవైపున సుభాష్‌నగర్ కాలనీ-సున్నంభట్టి వరకు
- రూ.1629 కోట్లు, రూ.1587 కోట్లతో వేర్వేరు ప్రతిపాదనలు
- భూసేకరణకు రూ.230 కోట్ల--రూ.250 కోట్ల అంచనా వ్యయం
- రూ.25 కోట్లతో రెడ్డిసత్రం, కొత్త కాలనీల్లో రెండు పంప్‌హౌజ్‌లు
- వీటి ద్వారా వాగుల్లోని వరద నీరు గోదావరిలోకి ఎత్తిపోత
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించిన నిపుణుల కమిటీ

సాక్షి, హైదరాబాద్: భద్రాచలం పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు వరదల నుంచి రక్షణ కోసం గోదావరి నదికి ఇరు వైపులా 16 కి.మీల పొడవున కరకట్టలు నిర్మించాలని నిపుణుల కమిటీ ప్రతిపాదించింది. గోదావరికి కుడి వైపున బుర్గంపహాడ్ మండలం సంజీవరెడ్డిపాలెం నుంచి అశ్వాపురం మండలం అమ్మగారిపల్లె వరకు, ఎడమవైపున భద్రాచలంలోని సుభాష్‌నగర్ కాలనీ నుంచి దుమ్ముగూడెం మండలం సున్నంభట్టి వరకు కొత్త కరకట్టలు నిర్మించడంతో పాటు ఇప్పటికే కరకట్టలు ఉన్న చోట వాటిని బలోపేతం చేయాలని సూచించింది. ఇందుకు రూ.1629 కోట్లు, రూ.1587 కోట్ల అంచనాలతో రెండు వేర్వేరు ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. గతేడాది జూలైలో గోదావరి నదికి వరదలు భీకరంగా పోటెత్తడంతో భద్రాచలం పట్టణంతో పాటు పరిసర గ్రామాలు ముంపునకు గురైన విషయం తెలిసిందే. జూలై 17న సీఎం కేసీఆర్ భద్రాచలంలోని ముంపు ప్రభావిత ప్రాంతాలను సందర్శించి వరదల నుంచి శాశ్వత పరిష్కారం కల్పించడానికి రూ.1000 కోట్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(ఓ అండ్ ఎం) బి.నాగేంద్ర రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ వరదల నుంచి శాశ్వత పరిష్కారంపై అధ్యయనం జరిపి ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది.



రూ.8వేల కోట్లతో కరకట్టలు !

వరద రక్షణ గోడల పనుల కోసం తొలి ప్రతిపాదన ప్రకారం భూసేకరణ నిర్వహిస్తే రూ.237 కోట్లు, మరో ప్రతిపాదనను అనుసరిస్తే రూ.253.1 కోట్లు వ్యయం కానుందని కమిటీ అంచనా వేసింది. ఎకరాకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని ప్రతిపాదించింది. దాదాపు 230-250 ఎకరాల వరకు భూసేకరణ జరపాల్సి ఉండనుంది. కరకట్టల నిర్మాణానికి తొలి ప్రతిపాదన అనుసరిస్తే రూ.8329.75 కోట్లు, రెండో ప్రతిపాదనను అనుసరిస్తే రూ.8443.9 కోట్లు కానుందని తెలిపింది. కరకట్టలతో పాటు 15 మైనర్ స్ట్రక్చర్లు, 2 మీడియం స్ట్రక్చర్లు, 6 మేజర్ స్ట్రక్చర్ల నిర్మాణాన్ని ప్రతిపాదించింది.

పంపులతో గోదావరిలోకి వాగుల నీళ్లు ఎత్తిపోత

వరదల సమయంలో గోదావరిలో బ్యాక్‌వాటర్ వెనక్కి తన్నుతుండడంతో సమీపంలోని వాగుల ప్రవాహం అందులో కలవలేక ఎక్కడికక్కడే పేరుకుపోయి పరిసర ప్రాంతాలను ముంపునకు గురి చేస్తున్నాయి. దీనికి పరిష్కారంగా భద్రాచలంలోని రెడ్డిసత్రం, కొత్త కాలనీల వద్ద రూ.25 కోట్ల అంచనాలతో రెండు పంప్‌హౌజ్‌లు నిర్మించి వరద నీళ్లను ఎత్తి గోదావరిలో పోయాలని కమిటీ సూచించింది. బీటీ రోడ్లు, అప్రోచ్ రోడ్డుల కోసం మరో రూ.6.75 కోట్లను ప్రతిపాదించింది.

కరకట్టలను నిర్మించాలని ఏపీని కోరనున్న ప్రభుత్వం...

పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంతోనే భద్రాచలం, పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపిస్తోంది. నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు గోదావరికి ఇరువైపులా కరకట్టలు నిర్మించే పనులను చేపట్టాలని ఏపీ ప్రభుత్వం/పోలవరం ప్రాజెక్టు అథారిటీని త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కోరనుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణలో ఏర్పడనున్న ముంపు సమస్యకు పరిష్కారం కల్పించాలని గత కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీతో పాటు కేంద్రాన్నీ కోరుతున్న విషయం తెలిసిందే. ముంపునకు గురవుతున్న భూముల సేకరణ లేదా కరకట్టలతో వాటికి రక్షణ కల్పించంలో ఏదైనా ఒక పనిని పోలవరం ప్రాజెక్టు అథారిటీ/ఏపీ ప్రభుత్వం చేయాల్సి ఉంటుందని తెలంగాణ అధికారులు పేర్కొంటున్నారు.

ఏపీలో 175 సీట్లలో బీఆర్ఎస్ పోటీ: తోట

గుంటూరు మెడికల్: రానున్న ఎన్నికల్లో 175 ఎమెల్యే, 25 ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ పోటీ చేయనుందని, ఏపీలో బీఆర్ఎస్ మూడో ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఆవిర్భవిస్తున్నదని బీఆర్ఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బుధవారం గుంటూరు పర్యటనకు వచ్చిన ఆయనకు బీఆర్ఎస్ శ్రేణులు స్వాగతం పలికాయి. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

శ్రీవాణి ఆఫ్‌లైన్ దర్శన టికెట్ల జారీ పునఃప్రారంభం

తిరుమల: తిరుమలలోని గోకులం కార్యాలయంలో బుధవారం నుంచి ఆఫ్‌లైన్‌లో శ్రీవాణి టికెట్ల జారీని టీటీడీ పునఃప్రారంభించింది. తిరుమలలో ఈ నెల 28వ తేదీ వరకు రోజుకు 150 శ్రీవాణి టికెట్లను జారీ చేయనున్నారు. మార్చి నుంచి 500 టికెట్లు ఆన్‌లైన్‌లో, 400 టికెట్లు తిరుమలలోని గోకులం కార్యాలయంలో, 100 తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద భక్తులకు అందుబాటులో ఉంటాయి.

జిల్లా వార్తలు

'ఓపెన్' ఫీజు చెల్లింపునకు అవకాశం

ఖమ్మం సహకారనగర్/కొత్తగూడెం అర్బన్: ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు పొందిన అభ్యర్థులు తత్కాల్ విధానంలో పరీక్ష ఫీజు చెల్లించేందుకు మార్చి 4వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఈ విషయాన్ని ఖమ్మం, భద్రాద్రి డీఈఓలు సోమశేఖర శర్మ, ఎస్ఎస్ఎస్.ప్రసాద్, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. సాధారణ పరీక్ష ఫీజుతో పాటు అదనంగా పదో తరగతి వారైతే రూ.500, ఇంటర్ అభ్యర్థులైతే రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. www. telanganaopenschool.org వెబ్‌సైట్ ద్వారా కానీ మీ సేవ, టీఎస్ ఆన్‌లైన్‌లో కానీ ఫీజు చెల్లించవచ్చని వారు తెలిపారు.

ఎగబాకిన మిర్చి ధర



మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధర ఒక్కసారిగా ఎగబాకింది. విదేశాల్లో మిర్చికి డిమాండ్ ఉండటంతో ధర పెరిగినట్లు చెబుతున్నారు. ఖమ్మం మార్కెట్‌లో మిర్చి క్వింటాకు మంగళవారం రూ.18,500 ధర పలకగా.. బుధవారం రూ.600 పెరిగి రూ.19,100గా నమోదైంది. ఈనెల ఆరంభంలో రూ.18వేల నుంచి రూ.18,200 వరకు పలికిన ధర రెండు, మూడు వారాల్లో క్రమక్రమంగా పుంజుకుంది. మార్కెట్‌కు బుధవారం 51,561 బస్తాల మిర్చి విక్రయానికి రావడం, చైనా నుంచి ఎగుమతిదారులకు ఆర్డర్లు ఉండటంతో ధర పెంచుతున్నట్లు తెలుస్తోంది. ఇక తాలు మిర్చికి సైతం మార్కెట్‌లో గరిష్టంగా రూ.10,800, కనిష్టంగా రూ.7,500 ధర పలికింది. కాగా, కొనుగోళ్లను మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి అధికారి రుద్రాక్షల మల్లేశం పర్యవేక్షించారు.

శిక్షణకు సిద్ధం



కేటీపీఎస్‌లో నిర్మించిన శిక్షణ కేంద్రం

- కేటీపీఎస్ కేంద్రంగా జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు
- రూ. 8.50 కోట్లతో పనులు పూర్తి
- శరవేగంగా కేటీపీఎస్ ఓఅండ్ఎంలో ఆక్సిజన్ ప్లాంట్

పాల్వంచ: టీఎస్ జెన్‌కో పరిధిలోని కేటీపీఎస్ కాంప్లెక్స్ కేంద్రంగా విద్యుత్ ఉద్యోగుల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రూ.8.50 కోట్లతో ఈ సెంటర్ నిర్మాణం పూర్తి చేశారు. మారుతున్న సాంకేతికతపై ఉద్యోగులకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇచ్చి, పూర్తి స్థాయి నైపుణ్యాన్ని తీసుకొచ్చేందుకు ఈ ట్రైనింగ్ సెంటర్ ఎంతో అవసరం. బ్యాచ్‌ల వారీగా రాష్ట్రంలోని వివిధ జనరేటింగ్ స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బందికి ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కాలంలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తారు. రోజువారీగా తరగతుల నిర్వహణ, భోజన వసతి, సీఈ, ఎస్ఈ, ఇతర ఇంజనీర్లు, సిబ్బంది కోసం ప్రత్యేక గదులు, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లతో కూడిన భవనాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వీటీపీఎస్(విజయవాడ) కేంద్రంగా జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ ఉండేది. తెలంగాణ విభజన తర్వాత కేటీపీఎస్ కేంద్రంగా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. భద్రాద్రి జిల్లాలో కేటీపీఎస్‌తో పాటు, మణుగూరు బీటీపీఎస్ కేంద్రం ఉండడంతో అత్యధిక మంది ఉద్యోగులకు అందుబాటులో ఉండేలా ప్రస్తుతం పాల్వంచలోని పాత డీఏ వీ పాఠశాల ప్రాంగణంలో ట్రైనింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. కాగా, యాజమాన్యం సీ కాలనీ సమీపంలో కొత్తగా ట్రైనింగ్ సెంటర్‌ను నిర్మించింది.

రూ.2.50 కోట్లతో సిమిలేటర్ గదులు..

రూ. 6 కోట్లతో శిక్షణ కేంద్రం నిర్మించగా, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అన్ని రకాల పరికరాలతో కూడిన సిమిలేటర్ గదులను రూ.2.50 కోట్లతో తీర్చిదిద్దారు. ఈ సిమిలేటర్ ద్వారా కర్మాగారాల్లో ఉండే టర్బైన్, ఈఎస్పీ, బాయిలర్ తదితర అన్ని విభాగాల పనితీరును నేర్చుకుని, యూనిట్ నిర్వహణ సిస్టంను నడిపించే సామర్థ్యాలను తెలియజేస్తారు.

పనులు పూర్తయ్యాయి



జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ పనులు పూర్తయ్యాయి. భవనంలో తరగతి గదులు, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లను అధునాతన పద్ధతిలో తీర్చిదిద్దాం. సిమిలేటర్ గదులు, పరికరాలనూ ఏర్పాటు చేశాం. త్వరలోనే జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు చేతుల మీదుగా ప్రారంభిస్తాం.

– శ్రీనివాసబాబు, ట్రైనింగ్ సెంటర్ సీఈ

సీఎండీ చేతుల మీదుగా ప్రారంభం..

జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు చేతుల మీదుగా జెన్‌కో ట్రైనింగ్ సెంటర్, ఆక్సిజన్ ప్లాంట్‌ను ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 3వ తేదీనే సీఎండీ పర్యటన ఉంటుందని మొదట ప్రకటించారు. ఆ తర్వాత 18వ తేదీకి వాయిదా పడినట్టు చెప్పినా.. అప్పుడు కూడా సీఎండీ రాలేదు. దీంతో త్వరలోనే ఆయన పర్యటన ఉంటుందని సమాచారం.

అభివృద్ధి పనుల్లో లోటుపాట్లు ఉండొద్దు

కేటీపీఎస్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని టీఎస్ జెన్‌కో డైరెక్టర్(సివిల్) అజయ్ అన్నారు. కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారంలో నిర్మించిన ఆక్సిజన్ ప్లాంట్‌ను బుధవారం ఆయన సందర్శించారు. పనుల పురోగతి గురించి 5, 6, 7 దశల సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఈలు యుగపతి, మోక్షవీర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ ప్లాంట్ పనులు పూర్తి..

కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారంలో రూ.2.47 కోట్లతో ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణ పనులు సైతం పూర్తయ్యాయి. గాలి నుంచి ఆక్సిజన్ ఉత్పత్తి చేసే కేటీపీఎస్ ప్లాంట్‌లో రోజుకు 1050 క్యూబిక్ మీటర్ల ఆక్సిజన్ తయారవుతుంది. దీంతో 7 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం గల 150 సిలిండర్లను నింపవచ్చు. రాష్ట్రంలోని ఇతర జనరేటింగ్ స్టేషన్లకు ఇక్కడి నుంచే సిలిండర్లను సరఫరా చేయనున్నారు. ఆయా కర్మాగారాల్లో వార్షిక మరమ్మతులు, ఇతర పనులకు ఈ సిలిండర్లను వినియోగిస్తారు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ సిలిండర్ల వినియోగం అధికంగా ఉండగా, కొన్ని సందర్భాల్లో కొరత కూడా ఏర్పడింది. వీటిని బయట కొనుగోలు చేయాలంటే ఒక్కో సిలిండర్ ధర రూ.500 పైనే ఉంటుంది.

పండుగలతో భక్తిభావం

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మంత్రి దయాకర్‌రావుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

తొర్రూరు రూరల్: పండుగల ద్వారా ప్రజల్లో భక్తిభావం పెంపొందుతుందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. తొర్రూరు మండలం నాంచారిమడూరులోని శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు బుధవారం నిర్వహించగా మంత్రి పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గుంటుక యాదలక్ష్మి, ఎంపీటీసీ కుంభం సుకన్యరెడ్డితో పాటు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

గుడుంబా నిర్మూలనకు చర్యలు

వరంగల్ ఎక్సైజ్ డీసీ అంజన్‌రావు



మాట్లాడుతున్న అంజన్‌రావు

తొర్రూరు: ఉమ్మడి వరంగల్ జిల్లాలో గుడుంబా నిర్మూలనకు పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు వరంగల్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు తెలిపారు. తొర్రూరుకు బుధవారం వచ్చినాయన ఎక్సైజ్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష అనంతరం మాట్లాడారు. గుడుంబా నిర్మూలనకు ఆకస్మిక తనిఖీలు, రాత్రి పూట గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, నిందితులను బైండోవర్ చేస్తున్నామని, మళ్లీ అదే నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా, ఏడాది జైలుశిక్ష అమలుచేస్తున్నట్లు చెప్పారు. అంతే కాకుండా జిల్లావ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ వరద శ్రీనివాసులుతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు క్యాష్ అవార్డులు



ఉద్యోగికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఆర్ఎం ప్రభులత

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపో పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది ఉద్యోగులకు క్యాష్ అవార్డులు లభించాయి. డిపోలో బుధవారం జరిగిన సమావేశంలో వారికి ఖమ్మం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎస్తేర్ ప్రభులత క్యాష్ అవార్డులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేసి, అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు, ఉద్యోగులు శ్రీనివాస్, రాణి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఆధ్వర్యాన కొనసాగుతున్న జప్తు



బకాయిదారుల ఇంటి ఆవరణలో డీసీసీబీ మేనేజర్, ఉద్యోగులు

నేలకొండపల్లి: ఐదేళ్ల క్రితం రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని వారి ఇళ్లలో సామగ్రిని డీసీసీబీ అధికారులు జప్తు చేస్తున్నారు. డీసీసీబీ నేలకొండపల్లి బ్రాంచ్ ఆధ్వర్యాన కొత్తకొత్తూరు, తిరుమలాపురంల్లో ఇటీవల పలువురి ఇళ్లలో సామగ్రిని జప్తు చేయగా, బుధవారం సింగారెడ్డిపాలెం, నేలకొండపల్లిలో జప్తు చేపట్టారు. 2016-17తో పాటు 2019లో వివిధ గ్రూప్‌ల సభ్యులు రూ.20వేల చొప్పున తీసుకున్న జేఎల్‌జీ రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో వడ్డీతో కలిసి పేరుకుపోగా ఆస్తుల జప్తునకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ ఇందు మాట్లాడుతూ పలుమార్లు నోటీసులు ఇచ్చినా బకాయిదారులు స్పందించకపోవడంతో జప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉద్యోగులు సత్యాల కోటయ్య, ఖమ్మం వెంకటేశ్వర్లు, కనపర్తి నాగేందర్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, నిరుపేదల విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరిగ్గాలేదని కాంగ్రెస్ నాయకులు జెర్రిపోతుల అంజని, బచ్చలకూరి నాగరాజు తదితరులు ఆరోపించారు.

అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో యజ్ఞతారెడ్డి ప్రతిభ



యజ్ఞతారెడ్డి

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలం చొప్పకట్లపాలెంకు చెందిన యరమల యజ్ఞతారెడ్డి అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. చొప్పకట్లపాలెంలోని యరమల శ్రీనివాసరెడ్డి-విజయనిర్మల కుమార్తె యజ్ఞత హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదువుతోంది. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపిన ఆమెను జాతీయస్థాయి జట్టులోకి ఎంపిక చేశారు. ఈనెల 16నుండి 19వ తేదీ వరకు తెలంగాణ ఇండియా ఫైనాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో యజ్ఞత సత్తా చాటి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. ఆటల్లోనే కాక చదువులో ప్రతిభ చాటుతున్న ఆమెను పలువురు అభినందించారు.

'న్యాక్' గ్రేడ్ అభినందనీయం



నవీన్‌మిట్టల్‌తో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఇల్లెందురూరల్: ఇటీవల న్యాక్ 'బీ' ప్లస్ గ్రేడ్ సాధించిన ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులను ఉన్నత విద్య శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ, వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఇంద్రాణి, సభ్యుడు పిచ్చయ్య తదితరులు బుధవారం హైదరాబాద్‌లో కమిషనర్‌ను కలిశారు. కళాశాలలో టాస్క్ సెంటర్, వర్చువల్ క్లాస్‌రూం, గ్రంథాలయం, ఫిట్‌నెస్ సెంటర్, ఆర్ఓ ప్లాంట్ తదితర ఏర్పాట్లతో న్యాక్ గ్రేడ్ లభించిందని వివరించారు. ఈ సందర్భంగా నవీన్ అభినందించడమే కాక ఇదే స్ఫూర్తితో పనిచేసి మరింత మెరుగైన గ్రేడ్ సాధనకు కృషి చేయాలని సూచించారని ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు.